# 10. పుస్తక ప్రియుడు

**నేపథ్యం:** ''ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం'' అన్నారు... మాజీ రాష్ట్రపతి కీ.శే. డా॥ అబ్దుల్ కలాంగారు. ఆయన జన్మదినం అయిన అక్టోబరు 15వ తేదీని 'పఠన ప్రేరణా దినోత్సవం' (వాచన్ ప్రేరణా దివస్)గా మనం జరుపుకుంటున్నాం. పుస్తక ప్రాధాన్యతను తెలుసుకొని మంచి మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి. ఇప్పుడు సంఘ సంస్కర్త వీరేశలింగం గారికి పుస్తకాల పట్ల గల ఆసక్తిని తెలుసుకుందాం.

తన కొడుకుని టీచర్లందరూ ఉత్తమ విద్యార్థి అని పొగుడుతూంటే ఆనందంతో పొంగిపోయింది ఓ తల్లి.

ఆ తల్లి క్రమశిక్షణ, ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధులు ఆ అబ్బాయిని మంచి మార్గంలో నడిపాయి. అతను పాఠ్యపుస్తకాలే కాకుండా భారత, భాగవత పురాణాలు చదివేవాడు. తోటి విద్యార్థుల్లో వాటిలోని ఆసక్తికరమైన విశేషాలు చెప్తూ వాళ్ళలో ఆసక్తిని రేకెత్తించేవాడు. అతన్ని చూసి వాళ్ళందరూ తాము కూడా బాగా చదవాలనుకునేవారు.


ఒకసారి ఒక ఇంగ్లీషు దొర వాళ్ళ పాఠశాల చూడ్డానికి వచ్చాడు. అతని మంచి నడవడికని గమనించి ఖరీదైన పుస్తకాన్ని బహుకరించాడు. అప్పట్నించి అటువంటి పెద్దపెద్ద పుస్తకాలన్నీ చదివెయ్యాలని ఎంతో ఉబలాటపడ్డాడు. అతనికి పుస్తకమంటే అంత ప్రేమ.

ఓసారి ఓ పుస్తకాల షాపుకి వెళ్ళి అన్ని పుస్తకాలూ ఆసక్తిగా చూస్తూ ''వసు చరిత్ర'' అనే గ్రంథాన్ని మురిపెంగా తాకాడు. ''ఆ పుస్తకం కావాలా? అది నీకు అర్థమవుతుందా? అసలు నువు చదవగలవా?'' అని అడిగాడు షాపు యజమాని.

''చదవగలను'' అని ధైర్యంగా జవాబిచ్చాడా అబ్బాయి.

''ఆ పుస్తకం ఖరీదు పావలా. ప్రస్తుతం నీ దగ్గర ఎంతుంటే అంతివ్వు ఇక్కడే కూచుని పుస్తకం చదువుకో మిగతా డబ్బులిచ్చాక అది నీ సొంతమవుతుంది అన్నాడతడు.

అర్థాలు:- మార్గం = దారి; నడవడిక = ప్రవర్తన; ఉబలాట పడుట = ఆరాట పడుట; మురిపెంగా = ఇష్టంగా; ఆర్జించి = సంపాదించి; ఖండించు = వ్యతిరేకించు.



**సొంతవాక్యాలు:-** ● క్రమశిక్షణ ● ఆసక్తి ● బహుకరించు ● పావలా ● ఖరీదు ● రోజంతా

ఆ మాటకు ఎంతో ఆనంద పడిపోయి తన దగ్గరున్న అణా ఇచ్చాడు. ఆరోజంతా అక్కడే కూర్చుని పుస్తకం చదివాడు. పుస్తకం ఖరీదు పూర్తిగా చెల్లించేవరకు అదే పద్ధతి కొనసాగించాడు.

ఎన్నో గ్రంథాలను చదివి విజ్ఞానాన్ని ఆర్జించి, మూఢనమ్మకాలను ఖండించాడు.

తన చదువు అనంతరం కొంత కాలం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సంఘసంస్కరణకు ఉపయోగపడే అనేక రచనలు చేశాడు. స్త్రీ విద్యా వ్యాప్తికి నడుంకట్టాడు. 'వివేకవర్ధిని' అనే పత్రికను స్థాపించాడు. స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని ఖండించాడు. సమాజంలో స్త్రీకి సమాన స్థానం ఇవ్వాలని పోరాడాడు. బాల్య వివాహాల్ని నిరసించాడు. వితంతు వివాహాలని ప్రోత్సహించాడు. స్వార్థ రహితమైన సేవతో సమాజంలోని మూఢనమ్మకాలను అంతమొందించడానికి నడుం కట్టి చివరి క్షణం వరకు పోరాడాడు.

ఆయనే సంఘ సంస్కర్త, నవ్యాంధ్ర వైతాళికుడు కందుకూరి వీరేశలింగం!

**"అక్షర రూపం దాల్చిన ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక"**

## I. వినండి-సంభాషించండి.

1. మీ ఉపాధ్యాయిని/ఉపాధ్యాయుడు పాఠాన్ని ప్రకాశ పఠనం చేయునపుడు శ్రద్ధగా వినండి. కొత్త పదాలను, ఆలోచనలను, సంకల్పన (కాన్సెప్ట్)లను నోటుపుస్తకంలో నమోదు చేసుకోండి. తరగతిలో చర్చించండి.
2. పుస్తకాలు చదవటం వలన కలిగే లాభం గురించి చర్చించండి.

## II.అ. ఒక్కొక్క వాక్యంలో జవాబులు రాయండి.

1. వీరేశలింగం తోటి విద్యార్థుల్లో ఏ విధంగా ఆసక్తిని రేకెత్తించేవాడు?
2. ఇంగ్లీషుదొర వీరేశలింగానికి ఏం బహుకరించాడు?
3. వీరేశలింగంగారు చివరి క్షణం వరకు దేనికోసం పోరాడాడు?

## ఆ. మూడు, నాలుగు, వాక్యాల్లో జవాబులు రాయండి.

1. వీరేశలింగం తోటి విద్యార్థులకు ఏ విధంగా ఆదర్శం?
2. షాపు యజమాని వీరేశలింగంతో ఏమన్నాడు?
3. వీరేశలింగంగారు సంఘ సంస్కర్తగా చేసిన సేవలు రాయండి.

## III. భాషావగాహన

### అ. కింది ఖాళీలను సరియైన పదాలతో పూరించండి.

1. ఆ అబ్బాయి ______ మంచి మార్గంలో నడిపాయి. (ని, గురించి)
2. అతని ______ పుస్తకమంటే అంత ప్రేమ (యొక్క, కి)
3. స్వార్థరహితమైన సేవ ______ చివరి క్షణం వరకు పోరాడాడు. (లో, తో)

### ఆ. వాక్యరకాలు రాయండి.


1. అది నీకు అర్థమవుతుందా? ______
2. ఆ పుస్తకం ఖరీదు పావలా. ______

### ఇ. వాచకాలు రాయండి.

1. కొడుకు
2. పుస్తకం
3. ఉపాధ్యాయుడు
4. స్త్రీ

**IV. సృజనాత్మకత:-**

**1. వీరేశలింగం గారి గురించి అంతర్జాలం సహాయంతో 10 వాక్యాలు రాయండి.**




2. పుట సంఖ్య: 28లో ..... "తన చదువు అనంతరం..... వైతాళికుడు కందుకూరి వీరేశలింగం" వరకు గల పరిచ్ఛేదం పఠనం చేసి కింది సూచనల ప్రకారం రాయండి.

**అ. ఖాళీలు పూరించండి**

1. వీరేశలింగం నిరసించినది ________
2. స్థాపించిన పత్రిక ________
3. వీరేశలింగం నడుంకట్టినది ________
4. వీరేశలింగం ప్రోత్సహించినది ________

**ఆ. కృత్యములు పూర్తి చేయండి.**

1. పరిచ్ఛేదం ఆధారంగా రెండు సర్వనామ పదాలు : ________, ________
2. పరిచ్ఛేదం ఆధారంగా రెండు విశేషణ పదాలు : ________, ________

**ఇ. కందుకూరి వీరేశలింగంగారిని ఈ విధంగా కొనియాడవచ్చు.**

**ఈ. కొత్త పదాలు కింద గీతగీయండి. వాటి అర్థాలను ఊహించండి. నిఘంటువులో సరిచూసుకోండి.**

**ఉ. గ్రంథాలయానికి వెళ్ళి మీకు నచ్చిన పుస్తకం చదివి కింది పట్టిక పూరించండి.**

| నీకు నచ్చిన పుస్తకం | రచయిత పేరు | అందులోని పాత్రలు | అందులోని ముఖ్యాంశాలు | నీకు నచ్చిన విషయం | నీతి |
|---|---|---|---|---|---|
| | | | | | |

**నేనివి నేర్చుకున్నా.**

• చక్కని పుస్తకాలు చదివే అలవాటు చాలా ఉపయోగకరం. • జనజాగృతి కలిగి సమాజానికి చేతనైనది చేయాలి.